రాజకీయం.. రసవత్తరం..

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



కాప్రా: మాజీ సీఎం కేసీఆర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఆయనను కలిశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలను బీఆర్ఎస్ సొంతం చేసుకుంది. కానీ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయింది. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ పరిధిలో పార్టీ ఓటమికి గల కారణాలను అధినేత కేసీఆర్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డితో పాటు మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఉన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో మరోమారు విద్యార్థులు ఆందోళనకు దిగారు. 4 నెలల క్రితం పలుమార్లు ఆహారంలో పురుగులు రావడంతో విద్యార్థులు ఆందోళన చేయడంతో విద్యార్థి సంఘాలు వారి పక్షాన ఆందోళన చేశారు. దీంతో మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి విద్యార్థులతో సమావేశమై మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. గురువారం రాత్రి భోజనం సరిగ్గా లేదని, నాణ్యమైన ఆహారం అందించడం లేదని విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. యూనివర్సిటీలోని అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ ఎదుట ధర్నా నిర్వహించారు. దీంతో యూనివర్సిటీలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు రంగంలోకి దిగి విద్యార్థుల ఆందోళన విరమింపజేశారు.

- కాంగ్రెస్‌కు కౌన్సిల్‌లో పూర్తి మెజార్టీ ఉన్నా దక్కని చైర్మన్ పీఠం
- బీఆర్ఎస్ చైర్మన్‌కు కాంగ్రెస్ అగ్రనాయకుల మద్దతు
- నిరాశలో ఉన్న కాంగ్రెస్‌లో చేరిన 13మంది కౌన్సిలర్లు
- అగ్ర నేతలు అవిశ్వాసాన్ని అడ్డుకుంటున్నారని ఆవేదన
- ఇలా చేస్తే తాము కాంగ్రెస్‌ను వీడతామంటూ హెచ్చరికలు



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం

మేడ్చల్: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నవిధంగా తయారైంది మేడ్చల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పరిస్థితి. చైర్మన్ పీఠం కోసం ఎన్నో ఆశలు పెట్టుకుని స్థానిక నేతలు, కాంగ్రెస్ కౌన్సిలర్లు వలలు వేసి, ప్రలోభాలకు గురిచేసి ఎన్నో ఆశలు చూపి కలిసికట్టుగా ఉన్న బీఆర్ఎస్ కౌన్సిలర్లను చీల్చి ఏకంగా 13 మందిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. మొత్తం కౌన్సిల్‌లో 23మంది కౌన్సిలర్లు ఉండగా చైర్మన్‌తో పాటు ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. 13 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 16కు చేరింది. బీజేపీకి ఒక కౌన్సిలర్ ఉన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 16కు చేరడంతో అవిశ్వాసానికి కావాల్సిన సంఖ్య బలం సమకూరింది. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డిని కుర్చీ నుంచి దించాలని 20 రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు అందజేశారు. దీంతో అధికారులు మున్సిపల్ కార్యాలయానికి అవిశ్వాసం నోటీసు పంపి కౌన్సిలర్ల సంతకాల పరిశీలన పూర్తిచేసి తిరిగి కలెక్టర్ కార్యాలయానికి పంపారు. జూన్ మొదటి వారంలో అవిశ్వాస సమావేశం తేదీ రావాల్సి ఉండగా నాయకుల పైరవీలతో అది పెండింగ్‌లో పడింది.

అన్నీ ఉన్నా.. అక్కడే ఆగింది..

మొదటి నుంచీ చైర్ పర్సన్‌కు వ్యతిరేకంగా ఉన్న కౌన్సిలర్లు బలం లేకుండా, బీఆర్ఎస్‌లో ఉన్నన్ని రోజులు నాటి మంత్రి మల్లారెడ్డి ఒత్తిళ్లు, తాయిలాలు, గోవా, మలేషియా ట్రిప్పుల కారణంగా మేడ్చల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం ఆగింది. ప్రభుత్వం మారడం, మెజార్టీ 13 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో బలం 16కు పెరిగింది. మేడ్చల్ మున్సిపల్ పీఠాన్ని తమ పార్టీ ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు వ్యూహాలు రచించారు. ఇందులో భాగంగానే నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ కౌన్సిలర్లకు అన్నీ తానై పార్టీలో చేర్చుకుని సీఎం రేవంత్‌రెడ్డితో కండువాలు కప్పించారు. మేడ్చల్ మున్సిపల్ రాజకీయాన్ని పూర్తిగా తన చేతుల్లోకి తీసుకుని అన్నీ తానై నడిపించాడు. చైర్మన్‌ను దించే బాధ్యత తనదే అని చేరికల సమయంలో జంపింగ్ కౌన్సిలర్లకు హామీ ఇచ్చారు.

అవిశ్వాస గండం తప్పించాలని..

మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికరెడ్డిని కుర్చీపై దించడం దాదాపుగా ఖాయం కావడంతో ఆమె భర్త నర్సింహారెడ్డి ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. కుర్చీ కోసం తాను కాంగ్రెస్‌లో చేరతానని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులతో మంతనాలు పార్లమెంట్ ఎన్నికలకు ముందే మొదలు పెట్టారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డితో మంతనాలు జరిపి తన కుర్చీకి ఇప్పట్లో డోకా లేకుండా చేశారు. తన వర్గం కౌన్సిలర్లను, మెజార్టీ బీఆర్ఎస్ నాయకులను తీసుకుని తాను కాంగ్రెస్‌లో చేరతానని, తనకు అవిశ్వాస గండం తప్పించాలని నర్సింహారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ అగ్ర నాయకులను కోరడం, వారు సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడి ద్వారా రాయబారాలు నడపడంతో వజ్రేష్‌యాదవ్ పట్టుబడుతున్నా మేడ్చల్ మున్సిపల్ అవిశ్వాస సమావేశానికి తాత్కాలికంగా బ్రేకులు వేయించారు.

అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి..

కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం పెరడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పాలకుర్తి రాఘవేందర్‌గౌడ్ కౌన్సిలర్ అయిన తన భార్య భవానిని చైర్ పర్సన్ చేయాలని రాజకీయం నడుపుతున్నాడు. కాంగ్రెస్‌లో చేరిన, పాత కౌన్సిలర్లను ఆయన గ్రూపుగా మార్చి అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి అన్నీ తానై వ్యవహరిస్తున్నాడు. అవిశ్వాసం నోటీసు నుంచి మొదలు అన్ని పనులు చకచకా పూర్తి చేశాడు. అవిశ్వాసం తేదీ ఖరారైతే కౌన్సిలర్లను క్యాంపునకు తీసుకెళ్లడానికి అన్ని వనరులను సిద్ధం చేసుకున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు ఏకతాటిపై నడిచేలా చూసుకుంటున్నాడు. చైర్ పర్సన్‌పై ఆగ్రహంతో పార్టీని వీడిన కౌన్సిలర్లు త్వరగా అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయించాలని ఒత్తిళ్లు తెస్తున్నారు.

కేవలం తమ స్వార్థం కోసం..

తమకు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ పూర్తిగా అండగా ఉన్నా కేవలం తమ స్వార్థం కోసం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి అధికార బలంతో అవిశ్వాస తేదీ రాకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా సుధీర్‌రెడ్డి రాజకీయం నడిపిస్తూ పార్టీకి రావాల్సిన చైర్మన్ పదవిని అడ్డుకుంటున్నారని విమర్శలు చేస్తున్నారు. తామంతా చైర్ పర్సన్ వ్యవహార శైలి నచ్చకపోవడంతోనే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరామని, కాంగ్రెస్‌లో చేరిన తర్వాత కూడా చైర్మన్‌పై తమ ప్రతీకార చర్యలు లేకపోతే తాము పార్టీ మారడంలో అర్థమేముందని వారు నిలదీస్తున్నారు.

పార్టీలో ఉండాలా.. పోవాలా..?

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారితో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఏకతాటిపై వచ్చి చైర్ పర్సన్ దీపికరెడ్డిని కుర్చీ నుంచి దించాలని పట్టుబడుతున్నారు. తామంతా కాంగ్రెస్ పార్టీలో ఉండాలా లేదా బీజేపీలో చేరి తమ పంతం నెగ్గించుకోవాలా అంటూ కౌన్సిలర్లు తమకు అనుకూలంగా ఉన్న నేతలతో అంటున్నారు. చైర్ పర్సన్ భర్త నర్సింహారెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని, ఆయనకు మద్దతిస్తే కాంగ్రెస్‌లో చేరిన తాము తిరిగి వెళ్లిపోతామని కౌన్సిలర్లు హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద మేడ్చల్ మున్సిపాలిటీ రాజకీయం కాంగ్రెస్‌కు పెద్ద సవాల్‌గా మారింది.

రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే యత్నం సిగ్గుచేటు


ప్రవీణ్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు

ఘట్‌కేసర్: అమలు కాని హామీలిచ్చి గద్దెనెక్కగానే స్టాంప్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరచాలని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నించడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు చులువాదీ ప్రవీణ్‌రావు విమర్శించారు. ఘట్‌కేసర్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు విడుదల అనంతరం హామీలకు తిలోదకాలు ఇస్తారని తేలిపోయిందని, చేతకాని హామీలు ఎందుకివ్వాలని ప్రశ్నించారు. గద్దెనెక్కడమే లక్ష్యంగా ప్రకటనలు చేసి ఇప్పుడు ప్రజలపై భారం మోపడం సరైంది కాదన్నారు.

కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం


చెక్కులను అందజేస్తున్న ప్రభాకర్

మేడ్చల్: కంపెనీలో పని చేస్తూ మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు కార్మిక సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సాయం చెక్కులను జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ యాదయ్య అందజేశారు. మండలంలోని షీలా ఫోం కంపెనీలో పనిచేసే మేడ్చల్‌కు చెందిన కె.శంకర్, అత్వెల్లికి చెందిన అహ్మద్‌బేగం గతంలో మరణించారు. షీలా కంపెనీలోని యూనియన్ బీఆర్‌ఎటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ కార్మిక కుటుంబాల ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసి వారికి చెక్కులను అందజేశారు.

బీఆర్ఎస్‌తోనే బీజేపీ గెలిచింది

మేడ్చల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ కావడంతోనే బీజేపీ గెలిచిందని పీసీసీ కో ఆర్డినేటర్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధికార ప్రతినిధి సురేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆయన మేడ్చల్‌లో విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం చేసి తమ సానూకూల ఓట్లు బీజేపీకి వేయించి కాంగ్రెస్‌ను దెబ్బతీశారని అన్నారు. తమ ఓట్లతో పాటు, తమ సానూభూతిపరుల పట్ల బీఆర్ఎస్ నాయకులు బీజేపీకి పడేలా చేశారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం వల్లే కాంగ్రెస్ కొన్ని ప్రాంతాల్లో దెబ్బతిందని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్, బీజేపీల చీకటి ఒప్పందాలను గమనిస్తున్నారని అన్నారు.

అన్నోజిగూడలో రక్తదానం



పోచారం: అన్నోజిగూడలోని శివాస్ ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి బర్త్‌డే సందర్భంగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. పలువురు యువకులు రక్తదానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్: మత సామరస్యాన్ని పాటిస్తూ ప్రజలు తమ పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మేడ్చల్ ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే బక్రీద్ పండగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. కుర్బానీల కోసం ముస్లింలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. పండగల సందర్భంగా సోషల్ మీడియాలో ఎవరినీ కించపరిచే, మనోభావాలు దెబ్బతీసే పోస్టులు పెట్టవద్దని అన్నారు. పోలీసుల నిఘా ఉంటుందని, రెచ్చగొట్టే పోస్టులను సర్క్యులేట్ చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా పెద్దలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, ఇతర పార్టీల నాయకులు, మతాల పెద్దలు, సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ షాప్‌లో అగ్నిప్రమాదం


బైక్ మెకానిక్ షాప్‌లో ఎగిసి పడుతున్న మంటలు

మేడ్చల్‌రూరల్: బైక్ మెకానిక్ షాప్‌లో అగ్నిప్రమాదం సంభవించడంతో ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతైన ఘటన మేడ్చల్ పట్టణంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికుల సమాచారం మేరకు పట్టణంలోని వివేకానంద విగ్రహం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న అర్జున్ చౌహాన్‌కు చెందిన బైక్ మెకానిక్ దుకాణాన్ని రోజులాగే బుధవారం రాత్రి మూసేసి ఇంటికి వెళ్లారు. గురువారం తెల్లవారుజామున షాప్‌లో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో 15కు పైగా ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి


పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

కీసర: ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కీసర పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ కీసర కమిటీ గురువారం వినతిపత్రం అందజేసింది. యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సీహెచ్ జయప్రద మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని, ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా నాయకురాలు రాధ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై అధికారుల కొరడా


సాకేత్ రోడ్‌లో..

కాప్రా: కాప్రా సర్కిల్ ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై జీహెచ్‌ఎంసీ మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. సాకేత్ రోడ్‌లో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని హెచ్చరిస్తూ.. ఆక్రమణలు తొలగించారు. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో గత్యంతరం లేక రోడ్డుపై పాదచారులు నడకసాగిస్తున్నారు. దీంతో పలుమార్లు ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. ఈ ఫుట్‌పాత్ ఆక్రమణలపై అటు అధికారులు కూడా తూతూమంత్రంగానే చర్యలు చేపడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ పరిధిలో ప్రధాన రహదారులైనా, ఇతర వీధుల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి యథేచ్ఛగా తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. అన్ని చోట్ల ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఎప్పటిలాగే ఏదో ఒక రోజు ఆక్రమణలు తొలగించి చేతులు దులుపుకోకుండా సర్కిల్ పరిధిలో ఎక్కడ ఆక్రమణ ఉన్నా వాటిని తొలగించి పాదచారులు సురక్షితంగా నడక సాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్య

కీసర: ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన హరిత(35) భర్తను విడిచిపెట్టి కొన్ని నెలల క్రితం తన ఇద్దరు పిల్లలతో కీసర వచ్చి అద్దె ఇంట్లో ఉంటోంది. పిల్లలను కీసరలోని హాస్టల్‌లో చేర్పించి, ఆమె చర్లపల్లిలోని ఓ కంపెనీలో పనిచేస్తోంది. బుధవారం రాత్రి తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పింది. ఆమె తల్లిదండ్రులు భూపలపల్లి నుంచి వచ్చేసరికే ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్థానికుల సాయంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు.

కామాక్షి ఫుడ్స్‌లో గడువు ముగిసిన పదార్థాలు

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా దేవరయాంజాల్‌లోని కామాక్షి ఫుడ్స్ గోదాములో గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కామాక్షి ఫుడ్స్ లైసెన్స్‌తో తయారు చేసి గడువు ముగిసిన వేరుశెనగ, మైదా, బజ్రా వంటి పదార్థాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు. వేర్‌హౌజ్ ప్రాంగణం అస్తవ్యస్తంగా ఉండటాన్ని గుర్తించారు. ఆహార పదార్థాలు తయారు చేసే సమయంలో నియమాలు పాటించట్లేదని, నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

మాజీ సర్పంచ్ బైరు రాములుపై భూకబ్జా కేసు

పోచారం: ఓ వాచ్‌మెన్ ప్లాట్‌ను కబ్జా చేసిన మాజీ సర్పంచ్‌తో పాటు అతడి కుమారుడిపై పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడలోని సర్వే నంబర్ 756లో ప్లాట్ నంబర్ 261పార్టును బేగంపేట్‌కు చెందిన వాచ్‌మెన్ మల్లారెడ్డి 2005లో కొనుగోలు చేశాడు. ఈ ప్లాటును చౌదరిగూడ మాజీ సర్పంచ్ బైరు రాములు, అతడి కుమారుడు విఘ్నేష్‌గౌడ్ కబ్జా చేసి, దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరించారు. దీనిపై మల్లారెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. అధికారులు స్పందించి పోచారం పోలీసులను విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విచారణ క్రమంలో భాగంగా మాజీ సర్పంచ్ బైరు రాములుగౌడ్, అతడి కుమారుడు విఘ్నేష్ గౌడ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

మల్లాపూర్: మానసిక ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్‌మల్లాపూర్‌కు చెందిన మహేందర్ కుమారుడు రోహిత్ ప్రజాపతి(23) కొంతకాలంగా ఆర్థికంగా, మానసిక ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పొంగుతున్న మురుగు

మేడ్చల్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగి పారుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రోడ్డులో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగి రోడ్డు మీద పారుతుండటంతో అటు వైపు వాహనాలపై వెళ్తున్నవారు, సమీప ఇళ్లు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

స్కూళ్లు తెరిచేలోపు పనులు పూర్తి చేయాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టే పనులు నాణ్యత ప్రమాణాలతో ఉండాలని, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, స్కూల్ యూనిఫాం తయారీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనలో భాగంగా 286 స్కూళ్లలో చేపట్టిన తాగునీరు, టాయిలెట్స్, మైనర్ రిపేర్, మేజర్ రిపేర్, బాలికల కోసం చేపట్టిన టాయిలెట్స్, విద్యుత్ వంటి పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. స్కూళ్లు తెరిచేలోపు పనులు పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేపట్టకముందు, చేపట్టిన తర్వాత ఫొటోలను పంపాలని కలెక్టర్ సూచించారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్(దుస్తులు)లను పాఠశాల పునః ప్రారంభం కావడానికి ముందే అందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్కూల్ యూనిఫామ్‌లు కుట్టే బాధ్యత స్వయం సహాయ సంఘాలకు అప్పగించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. నిర్ణీత గడువులోగా యూనిఫాంల తయారీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, డీఆర్‌డీఓ పీడీ సాంబశివరావు, జిల్లా విద్యాధికారి విజయకుమారి, మెప్మా అధికారి అనిల్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఈటలకు శుభాకాంక్షల వెల్లువ


ఈటలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మేడ్చల్‌రూరల్: మల్కాజిగిరి ఎంపీగా గెలుపొందిన ఈటల రాజేందర్‌ను గుండ్లపోచంపల్లి మున్సిపల్, మండలంలోని పలు గ్రామాల బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతి, నాయకులు సురేందర్, అశోక్, కృష్ణ, వెంకటేశ్ ముదిరాజ్, హన్మంత్, శ్రీకాంత్, నరేశ్ పాల్గొన్నారు.

మేడ్చల్‌లో జోరుగా వర్షం


కాలనీల్లో రోడ్లపై పారుతున్న వర్షం నీరు

మేడ్చల్, మేడ్చల్‌రూరల్: మేడ్చల్‌తో పాటు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, పలు మండలాలు, గ్రామాల్లో గురువారం సాయంత్రం జోరుగా వర్షం కురిసింది. ఉదయం నుంచి వేడిగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా చల్లబడి అరగంట పాటు జోరుగా వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. పలు గ్రామాల్లో చిన్న కుంటలు నీటితో నిండాయి.

కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


విత్తన, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కీసర: కలెక్టర్ ఆదేశాల మేరకు కీసరలోని విత్తన, ఎరువుల విక్రయ దుకాణాలను జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏడీఏ వెంకట్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సీడ్ సెర్టిఫికేషన్ ఆఫీసర్ మహేష్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. కాలం చెల్లిన విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మి, బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.

వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం


ఈసీఐఎల్ ఎక్స్ రోడ్‌లోని సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం

కుషాయిగూడ: అన్నిదానాల్లో కంటే అన్నదానం గొప్ప అన్నారు వాసవి మిత్రమండలి ప్రతినిధులు. ఈసీఐఎల్ ఎక్స్ రోడ్‌లోని సాయిబాబా ఆలయం వద్ద వాసవి మిత్ర మండలి మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో అన్నవితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమావాస్య రోజు అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్తా, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్‌గుప్తా, కోశాధికారి రామిని తిరుమలేశ్‌గుప్తా, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్తా, ఉపాధ్యక్షులు చెన్న చక్రపాణిగుప్తా, నంగునూరి అశోక్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.